....ఈ వారపు పెద్దగాథ..



# 'మగడా! నన్ను ఆజ్ఞ పెట్టకు'

• మొసలికంటి సంజీవరావు •

★

"మగడా! నా సహస్ర విటులలో నీ వొకడివి! నన్ను ఆజ్ఞ పెట్టకు!" అని ఏ ఇల్లాలైనా గద్దించిందంటే, అసంభవమని నిరసిస్తాం. కాని, 2000 సంవత్సరాలక్రింద రోమను సామ్రాజ్యాన్ని ఏకచ్ఛత్రంగా పరిపాలించిన ప్రథమ రోమను చక్రవర్తి పుత్రిక ఈ విధంగా తన భర్తను ధిక్కరించి, యథేచ్ఛగా సంచరించింది. ఆ చక్రవర్తి పేరు 'అగస్టస్ సీజరు.' ఈ సీజరు తన మూడవ ఇల్లాలు బాలింత కాగానే ఆమెను విడిచి, సభర్తృకయైన మరియొక కాంతను ఆమె భర్తచేత భార్యాదానం చేయించుకొని, వివాహమాడాడు! అదంతా ఒక గాథ. సీజరు వదలివేసిన మూడవ భార్యకు ఉదయించిన బాలిక — జూలియా — మన కథానాయిక.

సీజరు నాలుగో వివాహం చేసుకొని చాలా సుఖపడ్డాడు. చక్కదనాల రాశియైన "లివియా" సీజరు భార్య — ఆ మహావీరుడిని తన మనోహర కోమల బాహుడోలికలో ఊపి, ఆనందపరవశుడిని చేసింది. అప్పటికి అతడు ఇంకా చక్రవర్తి కాలేదు. రాజకీయ పరిస్థితులు ఇంకా అల్లకల్లోలంగా ఉన్నాయి. తన మిథ్యామిత్రులూ, శత్రులూ చేసే కుతంత్రాలకి లోగి, అంతరించడమూ, లేక వారిని నిర్జించి తాను చక్రవర్తి కావడమూ — అన్న మహాసమస్యలో పడ్డాడు. అటువంటి క్లిష్ట పరిస్థితులల్లో అతని భార్య మేధావియైన మంత్రిలాగ ఉపదేశించి, సీజరుయొక్క ఉన్నతికెంతైనా తోడుపడింది.

సీజరు బాహ్యశత్రువులను కూడా జయించి సామ్రాజ్యాన్ని పెంపుచేశాడు. ఆ విజిగీషుని తలచుకొని ఇతర దేశాధీశులు గడగడలాడేరు. సామంతులూ రాష్ట్రపాలకులూ భయభక్తి వినమ్రులయ్యారు. అంత్యకాలానికి ప్రజలు శాంతి సౌఖ్యాలనుభవించి సీజరును దైవములాగ ఆరాధించారు. కవులను సత్కరించి, కళలను పోషించి సీజరు శాశ్వతమైన కీర్తి గడించుకున్నాడు.

సీజరు దేవేంద్రభోగమనుభవించి చిరకాలము జీవించాడు. సీజరువంటి ధన్యుడు లేడని లోకమంతా అభినందించారు కాని, అంతవాడికైనా కూడా మనస్తాపం, మనోవేదన తప్పినవి కావు. ఆ మహనీయుడి దురంత సంక్షోభానికి కారణం అతని కూతురే.

సీజరు పుత్రిక పేరు 'జూలియా'. తన భార్యను గర్భవతి కాగానే వదలివేసినా, బిడ్డను మాత్రం అసాధారణంగా ప్రేమించి, సీజరు అతిముద్దుగా సాకించి, మహాపండితులచేత చదువు చెప్పించి, సమస్త విద్యల్లోనూ సమస్త కళలలోనూ జూలియాను మేలుబంతిని చేశాడు. అందచందాలలో ఆమెను మించిన బాలిక లేదు. వీణ పలుకులను పరిహసించే ఆ బాలిక మంజులాలాపాలు విని ముగ్ధులు కాని

వారు లేరు. ఆ విశ్వపితునికి చల్లని వాక్పటిమా, అఖండమైన చాతుర్యమూ, సౌందర్యసంపద చురుకుదనమూ భగవంతుడు ప్రసాదించేడు. తన కుమార్తె రత్నాన్ని చూసి సీజరు మురిసిపోయి, తగిన వరుణ్ణి వెదికి వివాహం చేసాడు. కాని, తనలో ఉన్న వ్యభిచారగుణం తన కూతురిలో సహస్రాధికమౌతుందనీ, ఆమె జారిణిఐపోయి తన మనస్సును దహించివేస్తుందనీ సీజరు గ్రహించలేకపోయేడు. ఎలా గ్రహిస్తాడు?

తన ఏకపుత్రికను శీలవతినీ, మానవతినీ చెయ్యాలని శక్తివంచనలేకుండా సీజరు ప్రయత్నించాడు. కాని, ఆమె దుష్టస్వభావం ఉప్పెనలాగ పొంగి, మానవకల్పితమైన నిరోధాలను తుడిచివేసింది. కూతురుయొక్క ప్రకృతినీ ప్రవృత్తినీ సన్మార్గమున నడిపించాలని సీజరు ఎన్నికైన కట్టుదిట్టాలు చేశాడు. 'జూలియా ఒంటరిగా ఎవ్వరితోనూ మాట్లాడకూడదు. పరాయివాళ్ళతో ఎటువంటి సంబంధమూ కలిగించుకోకూడదు' వెర్రి సీజరు! తను మేధావంతుడై యుండి, లోకానుభవము కలిగియుండి కూడా మానవశాస్త్రాన్ని గ్రహించలేక, పుత్రికాస్నేహంకరుడై ఇటువంటి కఠిన నియమాలు చేసాడు. ఉన్మత్త మత్తగజములాంటి నైజం విజృంభించినప్పుడు లోన నిబంధనలు దారపుపోగులలాగు పుటుక్కున తెగిపోతాయని గ్రహించలేకపోయాడు. కూతురిని స్త్రీ ప్రపంచానికి ఆదర్శంగా చెయ్యాలని ప్రయత్నిస్తే, కులటలకు ఆదర్శమయింది.

తన పుత్రికకు యుక్తవయస్సు రాగానే సీజరు వివాహం చేశాడు. జూలియాకు ఒకటి కాదు— మూడు వివాహాలయేయి. సీజరు సోదరికి పూర్వభర్తవలన కలిగిన పుత్రుడు ఆమె మొదటిమగడు. అతని పేరు 'మార్సెల్లసు'. నవయౌవనంలో వున్న మార్సెల్లసు రూపంలో, విద్యలో, శౌర్యంలో, యుద్ధవ్యాపారంలో, పరిపాలనలో, నిరుపమానుడు. వరుడు సర్వవిధాలా తగినవాడని సీజరు చాలా సంతోషించాడు. పౌరులందరూ కూడా చాలా సంతోషించారు, కాని, ఎవరు ఎంత సంతోషిస్తే ఏమి? జూలియాకు మాత్రం ఆ నవమోహనాకారుడు నచ్చలేదు.



కాలం గడుస్తూనే జూలియా మగడు మరణించాడు. తన కూతురు విచారించక పోయినా, సీజరు మాత్రం చాలా విచారించి మళ్ళీ అల్లుడిని అన్వేషించాడు. అతని పేరు "అగ్రిప్పా". అగ్రిప్పుడు బహు యోగ్యుడు. యుద్ధకుశలుడని, పరిపాలనా దక్షుడని, రాజనీతిజ్ఞుడని, నిష్కళంకమైన ప్రవర్తన గలవాడని పేరుపొంది, ప్రజాభిమానం చూరగొన్నాడు. అతడిమీద సీజరుకు అమితమైన దయా విశ్వాసాలు. మహాసామ్రాజ్యాన్ని పరిపాలించే సీజరుకు ఇద్దరే మిత్రులున్నారు. అందులో ఒకడు అగ్రిప్పుడు.

ఈ వివాహ సందర్భంలో సంభవించిన ఒక విశేషం గమనించాలి. రోమను చక్రవర్తికి అల్లుడు కావలసిన అగ్రిప్పుడు భార్యలేనివాడు కాడు: సీజరుకు పరవాడూ కాడు. అతడు సీజరు యొక్క మేనకోడలి మగడు.

ఆ భార్యాభర్తలు పరస్పరానురాగబద్ధులై సుఖంగా ఉన్నారు. కాని, సీజరు కేవలం స్వార్థపరుడు. చక్కగా విధినంటి పడుచు దంపతులకు వియోగం కలిగించవచ్చునా! అని అతడు విచారించలేదు. తన మగడితో సుఖపడుతున్న మేనకోడలికి అపచారం చెయ్యవచ్చునా అని అతడు విచారించలేదు. తన మేనకోడలికి విడాకులు ఇప్పించి, దాని భర్తకు తన విధవపుత్రికను కట్టబెట్టాలని సీజరు సంకల్పించాడు. కాని ఆ అభిప్రాయము తెలియగానే, అగ్రిప్పుడు భయవినమ్రుడై, తన ప్రియభార్యను విడిచిపెట్టి, జూలియాను వివాహమాడేడు.

తండ్రిమాట జవదాటలేక జూలియా వివాహమాడింది కాని, ఆ మగడు ఆమెకు నచ్చలేదు. అగ్రిప్పుడు నడివయసుమీరినవాడు. తరుణ వయస్సులో నుండి మన్మధుడిలాగ మెరసే మొదటి మగడే నచ్చలేదు! ఈ ముదిమగడు మరి నచ్చలేదు. ఐనప్పటికీ సీజరు పుత్రిక సహనము వహించి, ఎలాగో అతనితో కాపురంచేసి, ముగ్గురు కుమారులనూ ఒక కుమార్తెనూ కన్నది.

సీజరు కోరిన జామాతకూడా మరణించేడు. తన పుత్రికకు తిరిగి వైధవ్యం ప్రాప్తించినందుకూ తన మనస్సుకు నచ్చిన మిత్రుడు మరణించినందుకూ సీజరు చాలా పరితపించాడు. మిత్రలోపం వలన అవసానకాలంలో సీజరు చాలా బాధపడ్డాడు. చనిపోయిన మిత్రుడు తిరిగిరాడుగాని మరొక

ఆనందవాణి
పోస్టుబాక్సు నెంబరు
**1583**

చందాదారులు, వ్యాసకర్తలు, ఏజెంట్లు తాము ఆనందవాణికి వ్రాసే ఉత్తరాల చిరునామాలో పై నెంబరును తప్పక ఉదాహరించవలెను. లేనిచో మాకు ఆ జాబులు చేరడంలో ఆలస్యం జరగవచ్చు.

—మేనేజరు

అల్లుడిని తెచ్చుకోవచ్చుగదా. కాబట్టి సీజరు మళ్లా వరాన్వేషణ చేసాడు. ఈ మూడో అల్లుడు కూడా పరాయివాడు కాడు. తన భార్య పూర్వభర్త కుమారుడు — 'టైబీరియసు' యోగ్యుడని, జూలియాను అతనికిచ్చి సీజరు వివాహం చేశాడు. వరస చూస్తే, వధూవరులు చెల్లెలూ అన్నా అవుతారు. కాని, వారు ఏకోదరులు కారు గదా! అటువంటి వివాహం రోమను సంప్రదాయానికీ రోమను సభ్యతకీ విరుద్ధమైతే, సీజరు ఎందుకు చేస్తాడు?

జూలియాయొక్క రెండో భర్తలాగే ఈ మూడో భర్తకూడా గృహస్థే. అనుకూలవతియైన భార్యను వివాహమాడి అతడు హాయిగా సంసారసుఖమనుభవిస్తున్నాడు. అతని తల్లి సీజరు చక్రవర్తి భార్యగదా. ఆమూలంగా అతడు చక్రవర్తి దయకు పాత్రుడై ఉన్నతాధికారాలు, ఉత్తమ సన్మానాలు పొందుతూ నిర్విచారంగా ఉన్నాడు. సీజరు తరువాత తన కుమారుడిని చక్రవర్తిని చెయ్యాలని లివియా అమోఘమైన ప్రయత్నాలు రహస్యంగా చేస్తున్నది. సీజరు పుత్రహీనుడు గదా. అతనివలన లివియాకు సంతానం కలుగ

లేదు. కాబట్టి ఆ మేధావంతురాలు తన పూర్వ భర్త కుమారులలో జ్యేష్ఠుడైన టైబీరియసును సీజరు తదనంతరం చక్రవర్తిని చెయ్యాలని దారుణంగా సంకల్పించి చిక్కనివ్యూహాలు పన్నింది. సీజరు మొదటి అల్లుడు జీవించియుంటే తన పుత్రుడు చక్రవర్తి కాడని గ్రహించి, ఆ సర్వోత్తమ రాజకుమారుడిని లిబియాలో చంపించింది. భార్యావ్యామోహంలో పడి అంధుడైన సీజరుకు తప్ప ఆ రహస్యం అందరకూ తెలుసును.

చక్రవర్తి పుత్రిక — జూలియా జారిణి యని టైబీరియసుకు బాగా తెలుసును. అతడు కూడా ఆమె విటకోటిలోనివాడే. కనుక, తెలిసి తెలిసి స్వైరిణీ వివాహానికి అంగీకరించుట కష్టమే. కాని చక్రవర్తి కోరినప్పుడు ఎలాగు నిరాకరించగలడు? ఏమని నిరాకరించగలడు? చక్రవర్తిత్వం సులభసాధ్యంగా కనిపిస్తున్నది కూడాను. ఇంతకూ, ఎంత స్వైరిణియైనా, వయసు మీరింది: సంతానవంతురాలయింది; ఇకనైనా రస్తా మారదా అని సమాధానపడ్డాడు. తను ఆమె ప్రియుడే గనుక, ప్రియుడైనవాడిని వివాహమాడిన తరువాత జూలియా తప్పకుండా భార్యాధర్మం పాలించుతుందని టైబీరియసు ఆశపడ్డాడు. కాని, తెలిసి చేసుకున్నందుకు అనుభవించవలసిందే! అని వెన్నమీద చరిచి చెప్పినట్లు జూలియా తన యిష్టం వచ్చినట్లు సంచరించింది. పాపం! అతడు ఊరుకోలేక భార్యను అదమాయించబోయాడు. దాను చూసి హృదయంమీద గ్రుచ్చినట్లు, ఆ గయ్యాళి నిశ్చలంగా, విస్పష్టంగా, ఇలాగు చెప్పింది— "మగడా! సహస్ర విటులలో నీ వొకడివి— నన్ను ఆజ్ఞాపెట్టకు!"

జూలియా దుష్ప్రవర్తన దినదిన ప్రవర్ధమానమయింది. మానాభిమానాలు పూర్తిగా వదిలివేసింది. బంధువులేకాదు, సెనేటు సభ్యులే కాదు, అధికారులేకాదు, అనధికారులేకాదు, వ్యాపారులే కాదు, నిర్వ్యాపారులే కాదు— విచక్షణ లేకుండా చెంతకు వచ్చినవారినందరినీ చేరదీసి ఆదరించేది. క్రమంగా రాత్రీ పగలూ తెలియకుండా సర్వకాలం ప్రణయకదంబములో కలిసి యధేచ్ఛగా విహరించేది. భర్తయైన టైబీరియసు భరించలేక, చక్రవర్తితో యథార్థం చెప్పలేక, విషతుల్యమైన రాజధానిలో ఉండలేక, నాలుగుదినాలు ఉపవాసాలు చేసి, దూరంగా ఒక ద్వీపంలో నివసించేడు. సార్వభౌమురాలైన అతని తల్లికీ, సార్వభౌముడైన మామగారికి అతడు రాజధాని విడిచిపెట్టడ మిష్టంలేదు. అందుకే, ఆ మందభాగ్యుడు నిరశనవ్రతం అవలంబించి, అనుజ్ఞ పొంది, ఉన్మత్తుడిలాగు దేశాంతరం పారిపోయేడు.

అంతవరకూ, సీజరు కళ్ళూ చెవులూ మూసుకున్నాడు. చారచక్షువులైన చక్రవర్తులు దేశదేశాల రహస్యాలు సులువుగా గ్రహించగలరు గాని, ఇంటిరహస్యాలు మాత్రం గ్రహించలేరు. చివరకు సీజరు చెవులు విడ్డాయి. ఉద్దండ ప్రతిభాధురీణుడైన సీజరు చక్రవర్తి దుర్దాంత క్రోధావేశంతో హుంకరించి, తన పుత్రికయని కనికరించక, జూలియాకు ద్వీపాంతరశిక్ష విధించి, ఎవ్వరూ అటు వెళ్ళకుండా శాసించేడు

సీజరు మరణించిన తరువాత అతని అల్లుడే చక్రవర్తి అయ్యాడు. మామగారు జీవించియున్నంత కాలం అతడు తన భార్యమీద జాలి కలిగినట్లు నటించేడు. అతడు చక్రవర్తి కాగానే భార్యను రావించి ఆదరిస్తాడని పౌరులనుకున్నారు. కాని, అతని హృదయం కఠినమైపోయింది. అతని హృదయంలో ఎక్కడా జూలియాకు తావులేక పోయింది. చక్రవర్తి పుత్రికయనిగాని తన భార్యయనిగాని, కఠినప్రవాసమువలన పశ్చాత్తాపతప్తురాలై ఉంటుందనిగాని, టైబీరియసు చక్రవర్తి విచారింపలేదు. తండ్రి జీవించియున్నంతకాలం జూలియాకు భోజన భాజనాలకి లోపము లేక పోయింది. భర్త చక్రవర్తి కాగానే కూటికీ గుడ్డకీ కూడా కరువైపోయింది. చివరకు, ఒక చక్రవర్తి పుత్రిక, ఇంకొక చక్రవర్తి భార్య, క్షుధార్తయై, మాడి, మరణించింది!

ANANDAVANI is printed by V. AZIZULLA at Deccan Times Press Madras
and published by V. KALIDAS, at 14 Thambu Chetty Street, Madras
Editor: V. KALIDAS, Associate Editors: Andra Seshagiri Rao B.A., Mudda Viswanadham